క్లుప్తంగా

వైఎస్సార్ బీమా పథకంపై సమీక్ష



సచివాలయ అడ్మిన్లతో మాట్లాడుతున్న కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ చాంబర్‌లో శుక్రవారం సచివాలయ అడ్మిన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి వైఎస్సార్ బీమా పథకం అమలు తీరుపై అడ్మిన్లతో చర్చించారు. అలాగే వైఎస్సార్ బీమా పథకానికి నమోదు చేసుకున్న వారు తమ బీమాను వార్డు వలంటీర్ ద్వారా రెన్యువల్ చేయించుకోవాలని, రేషన్ కార్డు కలిగి ఇంతవరకు వైఎస్సార్ బీమా చేయించుకోని వారు ఈనెల 7వ తేదీలోపు వార్డు సచివాలయాలలో వలంటీర్ల ద్వారా బీమా చేయించుకోవాలన్నారు. కొత్తగా బీమా చేయించుకునే వారు వారి వివరాలను పూర్తిగా సరి చూసుకోవాలన్నారు.

పక్కాగృహాల నిర్మాణాలపై సమీక్ష

లింగాల : ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్పెషలాఫీసర్ మల్లికార్జున ప్రభుత్వ పక్కాగృహాల నిర్మాణాలపై మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పక్కాగృహాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. అదేవిధంగా లింగాలలో 23, బోనాలలో 27 పక్కాగృహాల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని.. వాటిని త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు లబ్ధిదారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సురేంద్రనాథ్, డీటీ త్రిభువన్‌రెడ్డి, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అమృత్ సరోవర్ చెరువు పనుల పరిశీలన



అమృత్ సరోవర్ కింద ఎంపికైన చెరువును పరిశీలిస్తున్న అధికారులు

లింగాల : గత ఏడాది మంజూరైన నిధులు మిగిలిపోవడంతో ఈ ఏడాది సుమారు రూ.90 వేలతో స్థానిక చెరువుకట్టపై ఉన్న కంపచెట్ల తొలగింపు, చెరువును శుభ్రం చేయడం వంటి పనులను ఉపాధి హామీ పథకం కింద నిర్వహించారు. ఈ పనులను శుక్రవారం ఎంపీడీఓ సురేంద్రనాథ్, అమృత్ సరోవర్ పథక అధికారులు ఎం.వి.రాజ్‌కుమార్, డీవై ఈఈ డబ్ల్యూఆర్‌డీటీ కరీముల్లా బాషా, ఏడీ డబ్ల్యూడీఈపీటీ డీఆర్పీ శ్రీనివాసులు పరిశీలించారు. పులివెందుల ఏపీడీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అమృత్ సరోవర్ కింద పనులను బాగా నిర్వహించారన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె, చిన్నరంగాపురం గ్రామాల్లో శనివారం ఉదయం 7.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. విద్యుత్ మెయింటెన్స్ కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

లింగాలలో..

లింగాల : మండల పరిధిలోని హిరోజీపురం, అంబకపల్లె, మురారిచింతల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ రమేష్‌బాబు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని.. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

కమలాపురం తహసీల్దార్‌గా పీఎండీ అలీఖాన్



కమలాపురం : మండల తహసీల్దార్‌గా పీఎండీ అలీఖాన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా చెన్నూరు తహసీల్దార్‌గా పని చేస్తున్న ఆయన కమలాపురంకు బదిలీపై వచ్చారు. ఇక్కడపని చేస్తున్న ఎంవీ నారాయణ రెడ్డి సీకేదిన్నెకు బదిలీపై వెళ్లారు. అలీఖాన్ మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు, రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రతి ఒక్కరూ తమ పరిధిలోని సచివాలయాలు, కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. మీ స్థాయిలో లేని సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు.

సీకేదిన్నె తహసీల్దార్‌గా ఎంవీఎస్ నారాయణరెడ్డి



చింతకొమ్మదిన్నె : సీకేదిన్నె తహసీల్దార్‌గా ఎంవీఎస్ నారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వి.గంగయ్య బదిలీపై పోరుమామిళ్లకు వెళ్లగా సీకేదిన్నెకు వల్లూరు మండలంలో విధుల నిర్వహిస్తున్న నారాయణరెడ్డి బదిలీపై వచ్చారు.

బాధ్యతగా విధులు నిర్వహించాలి

డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి



ఓపెన్ ఫోరంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : ఉపాధిహామీ పనుల్లో బాధ్యతగా విధులు నిర్వహించాలని డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఓపెన్ ఫోరంలో ఆయన మాట్లాడుతూ 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వరకు జరిగిన పనులపై సామాజిక బృందం చేపట్టిన తనిఖీ గురించి, అందులో బయట పడిన అంశాల గురించి ఆయన చదివి వినిపించారు. ఈ ఆడిట్‌కు సంబంధించి గత సామాజిక బృంద సభ్యులు గత నెల 22 నుంచి గ్రామాల్లో ఈనెల 1 వరకు ఉపాధి పనులను పర్యవేక్షించామన్నారు. ఇందులో భాగంగా ఏడాది కాలంలో ఉపాధితో పాటు అనుసంధాన శాఖలకు సంబంధించిన పనులకు మంజూరైన రూ.819.05 కోట్ల మొత్తంలో వేతనాలకు రూ.578.74 కోట్లు, మెటీరియల్‌కు సంబంధించి 240.31 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. ఈ పనుల్లో రూ.41,874 కోట్లను సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే క్షేత్రస్థాయి సిబ్బంది కూలీలకు రూ.272 వేతనం పడే విధంగా కొలతలు వేసి పనులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ నాగరత్నమ్మ, విజిలెన్స్ అధికారి యోగాంజనేయరెడ్డి, అంబుడ్స్ పర్సన్ సాంబశివారెడ్డి, జిల్లా క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయభాస్కర్, ఎంపీడీవో జి.రవికుమార్‌రెడ్డి, ఏపీవో ఓబులమ్మ, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

గొరిగేనూరులో విలేజ్ క్లినిక్ ప్రారంభం



విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : ప్రజల వద్దకు వెళ్లి వైద్యం అందించాలనే లక్ష్యంతో విలేజ్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గొరిగేనూరులో నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది ప్రజల వద్దకు వచ్చి వైద్యం అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతికళ మాట్లాడుతూ గతంలో ప్రజలు అనారోగ్యానికి గురి అయితే పట్టణానికి వెళ్లవలసి వచ్చేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు ఉండవన్నారు. ఇక్కడే వైద్యులు వుండటంతో రోగులకు వైద్యసేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మత్తయ్య, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ క్రీడాకారుడికి అభినందన



టెన్నిస్ క్రీడాకారుడు మహేందర్‌రెడ్డికి మెమెంటోను అందిస్తున్న వైఎస్ మధురెడ్డి, తదితరులు

పులివెందుల : ఈనెల 5వ తేదీన ఢిల్లీలో జరిగే జాతీయ స్కూలు గేమ్స్ టెన్నిస్ టోర్నమెంట్‌కు ఎంపికైన టెన్నిస్ క్రీడాకారుడు తుమ్మల మహేందర్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ మధురెడ్డి శుక్రవారం అభినందించారు. టెన్నిస్ కోచ్ విజయ్‌కుమార్, శ్రీసాయి చైతన్య కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరు వద్ద పూజలు నిర్వహిస్తున్న మాసీమబాబు

చెన్నూరు : వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలేకుండా చూడాలన్న లక్ష్యంతో రామనపల్లెలో రూ.3.50 లక్షలతో కొత్త మోటరు, మీటర్‌ను ఏర్పాటు చేసినట్లు వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మాసీమబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని రామనపల్లిలో కొత్తగా తాగునీటి బోరును, మీటర్లను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు రామనపల్లెలో తాగునీటి సమస్యను గుర్తించి కొత్త మోటరుతో పాటు పైపులైన్‌కు సంబంధించి బ్లాక్ అయిన పైపులకు మరమ్మతులు చేసి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఇప్పటికే రామనపల్లె గ్రామ పంచాయతీకి మూడు మోటర్లు ఉండగా, ఇప్పుడు నాలుగవది ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వప్న, దేవగుడి భాస్కర్‌రెడ్డి, కల్లూరు కృష్ణారెడ్డి, కాలువ కొండారెడ్డి, రామన చంద్రబాబు రెడ్డి, మడక వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలలో ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల జాబితా

పులివెందుల రూరల్ : రైతు భరోసా కేంద్రాలలో ఇన్‌పుట్ సబ్సిడీ రైతుల జాబితాను ప్రదర్శించినట్లు హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పెనుగాలులకు దెబ్బతిన్న అరటి పంట నష్టాన్ని అంచనా వేసి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు కొరకు నివేదికను ఆయా ఆర్‌బీకేలలో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించడం జరిగిందన్నారు. అర్హత ఉండి ఆ జాబితాలో రైతుల పేర్లు లేకపోయినట్లైతే అభ్యంతరాలు రైతు భరోసా కేంద్రంలోని ఉద్యాన, వ్యవసాయ సిబ్బందికి తెలపాలన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ



పతకాన్ని చూపిస్తున్న రవిశంకర్

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన బీకాం సెకండియర్ విద్యార్థి జి.రవిశంకర్ వెయిట్ లిఫ్టింగ్‌లో మరో సారి సత్తా చాటాడు. ఉత్తర్ ప్రదేశ్‌లోని లక్నోలో మే 25వ తేదీ నుంచి జూన్ 3 వరకు జరిగే ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్న రవిశంకర్ వెయిట్ లిఫ్టింగ్ అంశంలో ప్రతిభ కనబరిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. గత మార్చిలో పంజాబ్‌లోని చండీఘడ్ యూనివర్సిటీలో జరిగిన ఆలిండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కూడా బ్రాంజ్ మెడల్ సాధించాడని పీడీ నరహరి తెలిపారు. కాగా శుక్రవారం రవిశంకర్‌ను కళాశాల కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, పీడీ నరహరి, కోచ్ సుమన్‌లు అభినందించారు.

మహా కవయిత్రి మొల్లపై జాతీయ సదస్సు నిర్వహించాలి

చెన్నూరు : తెలుగు రామాయణ తొలి రచయిత్రి, మహా కవయిత్రి మొల్లపై జాతీయ సదస్సు నిర్వహించాలని మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపకులు డాక్టర్ గానుగపెంట హనుమంతరావు శుక్రవారం మండలంలోని శాటిలైట్ సిటీ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. కవయిత్రి మొల్ల మాంబ 14, 15వ శతాబ్దంలో వైఎస్సార్ జిల్లా గోపవరం మండలంలో జన్మించారన్నారు. కడప కోటిరెడ్డి సర్కిల్ వద్ద ఆమె విగ్రహాన్ని ఆవిష్కరించడం, ఆమె పేరుతో ఐదు రూపాయల తపాలా బిల్లా ప్రత్యేక కవర్ విడుదల చేశారన్నారు. అధికారులు మొల్ల పేరుతో యూనివర్సిటీ పక్షాన ప్రతియేటా జాతీయ సదస్సు నిర్వహించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

వైభవంగా ఉరుసు గంధోత్సవం



గంధోత్సవాన్ని నిర్వహిస్తున్న పీఠాధిపతి



గంధోత్సవం సందర్భంగా కేరళ వాయిద్యాలు

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడి వీధిలో వెలసిన తూగుట్లపల్లి జాగీర్దార్ హజరత్ సయ్యద్‌షా బడే గౌస్‌పీరాఖాద్రీ 91వ ఉరుసు మహోత్సవాన్ని శుక్రవారం ఆస్థానయే గౌసియాపీఠాధిపతి సయ్యద్ షా గౌస్‌పీరాఖాద్రీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. రాత్రి పీఠాధిపతి ఇంటి వద్ద నుంచి కేరళ వాయిద్యాలు, పక్కీర్ల మేళాలతో పురవీధుల గుండా గంధోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని హిందూ ముస్లింలు దర్గాలో ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియాఖాద్రీ, సయ్యద్‌షా మహమ్మద్ తాహీర్‌పీరాఖాద్రీతోపాటు వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన పీఠాధిపతులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత



బాలరాజుకు పింఛన్ డబ్బులు అందిస్తున్న వలంటీర్ స్వప్న

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లి గ్రామానికి చెందిన స్వప్న అనే వలంటీర్ తన క్లస్టర్ పరిధిలోని ఉన్న సి.బాలరాజుకు తిరుపతికి వెళ్లి పింఛన్ డబ్బులను శుక్రవారం అందజేసింది. సున్నపురాళ్లపల్లి గ్రామానికి చెందిన సి బాలరాజు గత కొన్ని రోజులు బ్రెయిన్ హ్యూమర్ వ్యాధితో తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకుని వలంటీర్ స్వప్న అక్కడికి వెళ్లి పింఛన్ సొమ్ము ఇచ్చింది.

ఖేలో ఇండియాలో స్వప్నప్రియకు స్వర్ణపతకం

కడప ఎడ్యుకేషన్: ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా విశ్వ విద్యాలయ మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బారువ స్వప్నప్రియ 87 కేజీల విభాగంలో స్వర్ణపతకం సాధించింది. ఈ పథకంతో యోగివేమన విశ్వవిద్యాలయానికి ఒక బంగారు పతకం, 3 కాంస్య పతకాలు లభించాయి. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ వైస్ చాన్స్‌లర్, క్రీడా బోర్డు చైర్మన్ ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వెంకటసుబ్బయ్య విజేతలకు వారి శిక్షకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఘన జీవామృతంతో అధిక దిగుబడులు

తొండూరు : ఘన జీవామృతం ఎరువులు వాడితే పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రమణ తెలిపారు. తొండూరులో కేపీపీ సర్వేలో భాగంగా ఏపీఎం, సీసీల ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించి ఘన జీవామృతం తయారు చేయు విధానంపై డెమో ద్వారా తయారు చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యం బాగుపడుతుందని రైతులు తక్కువ ఖర్చులతో పంటలు పడించుకోవచ్చునన్నారు. రసాయన వ్యవసాయం చేయడం ద్వారా భూమి నిస్సారంగా మారి బండబారిపోతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌డీఏఐ వి.రమణ, ఎల్2 ఎస్ఎఫ్ విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఐసీఆర్పీ రమేష్, ఐబీఐసీఆర్పీ సుమతి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలి



లింగాల : ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

వల్లూరు : ప్రజలు ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించడం వలన లార్వా దశలోనే దోమలను నివారించవచ్చునని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. మండలంలోని జంగంపల్లెలో శుక్రవారం జరిగిన డ్రైడే ఫ్రైడే అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. డ్రైడే పాటించడం వలన కలిగే ఉపయోగాలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న డీడీటీ పిచికారిని పరిశీలించి లార్వా సర్వేను పక్కాగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటరెడ్డి, సీహెచ్‌వో వేణుగోపాల్, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా వర్కర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని తేర్నాంపల్లె గ్రామంలో మలేరియా వ్యాధి నివారణ మాసోత్సవం, ఫ్రైడే డ్రైడే సందర్భంగా దోమల నివారణ కొరకు మందును పిచికారి చేసి ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి మలేరియా, డెంగీ వ్యాధుల గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ శివరాం, హెల్త్ సూపర్‌వైజర్ కుసుమ కుమారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్ ఫ్రీ చంద్రబాబును ఎవరూ నమ్మరు

వేంపల్లె : టీడీపీ అధినేత చంద్రబాబు మాటలను, మ్యానిఫెస్టోను రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎంపీటీసీ పఠాన్ రహమతుల్లా అన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. 2014 ఎన్నికలలో టీడీపీ ఇచ్చిన హామీలను అమలు చేయడలలో పూర్తిగా విఫలమైందని.. అందుకు నిదర్శనంగా 2019 సార్వత్రిక ఎన్నికలలో రాష్ట్ర ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారన్నారు. చంద్రబాబు ప్రకటించిన మ్యానిఫెస్టోపై ఆ పార్టీ నాయకులు సంకలు ఎగరేసుకుంటున్నారని, అది చూస్తుంటే నవ్వస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచిన రోజే విద్యాకానుక కిట్లు

కడప ఎడ్యుకేషన్: పాఠశాలలు పునః ప్రారంభం రోజే విద్యార్థులందరికీ విద్యాకానుక కిట్లును అందజేస్తామని సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి జిల్లాలో ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయన్నారు. శుక్రవారం కడపలోని సీఎస్ఐ స్కూల్లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు తరలుతున్న విద్యాకానుక కిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని పాఠశాలల్లో పాఠశాలలు తెరిచిన రోజే విద్యార్థులకు విద్యాకానుక కిట్లను అందజేస్తామన్నారు. అందుకు అనుగుణంగా జిల్లాలోని ప్రతి మండలం కేంద్రంలో జగనన్న విద్యాకానుక వస్తువులను భద్ర పరిచామని తెలిపారు. జిల్లాలో 2023-24 విద్యా సంవత్సరానికి 1,58, 156 మంది విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను అందజేయనున్నట్లు తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో విద్యాకానుక కిట్లన్నీ ఆయా మండల కేంద్రాలకు సరఫరా అవుతాయని చెప్పారు.

ప్రభుత్వ పాఠశాలల్లోను కార్పొరేట్ ఫలితాల



విద్యార్థులను సన్మానించిన ఎస్టీయూ నాయకులు

జమ్మలమడుగు : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి ఫలితాలను సాధించడం జరిగిందని డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ క్రిష్టఫర్‌లు తెలిపారు. శుక్రవారం జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతుల ప్రధానంతోపాటు తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమాన్ని ఎస్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు అంటే పోరాటం చేయడమే కాకుండా ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మంచి ప్రోత్సహకాలు ఇవ్వడం అనేది హర్షనీయం అన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంకా మెరుగైన ఫలితాలను సాధించడం కోసం ఉపాధ్యాయులు పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర నాయకులు మల్లు రఘునాథ్‌రెడ్డి, గురుకుమార్‌లు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులపై అనేక రకాలైన బాధ్యతలు పెట్టినప్పటికీ వాటిని అధిగమించి విద్యార్థులకు మంచి బోధన అందించడంతో నేడు ప్రభుత్వపాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి కంటే ఎక్కువ మార్కులు పద వతరగతి పరీక్ష ఫలితాలలో వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రీజనల్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, మూడు మండలాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం (రేపు) ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నుముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ హరిత సరిగా నిద్ర లేకపోవడం, ముందులాగా పని చేయలేకపోవడం, తల నొపప్పి, ఆందోళనగా ఉండటం, టెన్షన్, దడ, చమటలు పట్టడం, భయంగా ఉండటం, ఆలోచనలు అదుపులో లేకపోవడం తదితర జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వీరపునాయునిపల్లె : ఇంటి చుట్టూ ఉండే పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆరోగ్యశాఖ నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉరుటూరు1, కొమ్మద్ది, తలపనూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న డ్రైడే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి నీటిని నిలువ ఉంచుకొన్న తోట్లు, డ్రమ్ములను శుభ్రం చేయించారు.

ఇళ్లకు చుట్టు ప్రక్కల నీరు నిలు వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆలా చేయడం వలన దోమల ఉధృతి తగ్గుతుందని తెలిపారు. ప్రతి శుక్రవారం తప్పని సరిగా గ్రామాల్లో డ్రైడే చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి పూజలు

పులివెందుల టౌన్ : ఇ.కొత్తపల్లె పంచాయతీ మోట్నూతలపల్లె గ్రామంలో వెలసిన కోన గవేశ్వరస్వామి ఆలయంలో ఏడాది పాటు పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయని.. శనివారం ముగింపు పౌర్ణమి పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిల ఆశీస్సులతో భక్తుల సహకారంతో ఏడాది పాటు పౌర్ణమి పూజలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం గణపతిపూజ, పంచామృత, రుద్రాభిషేకం పూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరు ఈ పూజలలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలన్నారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

వైఎస్సార్ బీమా సర్వే త్వరగా పూర్తి చేయండి

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా వైఎస్సార్ బీమా సర్వేని ఐదు రోజుల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని సచివాలయ వెల్ఫేర్లు, వలంటీర్లు ఏ ఒక్క కుటుంబాన్ని వదలకుండా ప్రతి ఒక్క కుటుంబాన్ని వైఎస్సార్ బీమా పథకంలో చేరుస్తూ వారి ఈకేవైసీ తీసుకుని పూర్తి చేయాలన్నారు.

పబ్లిక్ లీగల్ నోటీసు
2023 మే 31వ తారీఖున జారీ చేసిన జవాబు నోటీసు

వై.ఎస్.ఆర్. జిల్లా, బద్వేలు వాస్తవ్యులు ఇంటి నెంబరు. 11/46-1, మెయిన్ బజారు నివాసి అయిన బచ్చు శేషయ్య కుమారుడు బచ్చు సురేష్ బాబుగారు ఇచ్చిన సూచనల మేరకు 2023, మే నెల 31వ తారీఖున సాక్షిపేపరులో శ్రీ ఎం. సుధాకర్ బాబ్జి గారు అడ్వకేటు, కడప, వారు తన కక్షిదారుడు చెంచిరెడ్డి గారి ఓబుల్‌రెడ్డి గారి తరుపున జారీ చేసిన పబ్లిక్ నోటీసుకు జవాబు (రిప్లై) నోటీసు ఏమనగా!

నా కక్షిదారుడు చెంచిరెడ్డి ఓబుల్‌రెడ్డి గారికి 2015 నవంబర్ నెల 3వ తారీఖున ఏలాంటి అగ్రిమెంటు వ్రాయ్యలు ఆస్తి గురించి వ్రాసి ఇవ్వలేదు. ఏలాంటి పైకము సదరు ఓబుల్‌రెడ్డి నుండి తీసుకొనలేదు. నా కక్షిదారుని సంతకం సదరు అగ్రిమెంటుపైన ఫోర్జరీ (Forgery) చేసి అక్రమ లాభార్జన కోసం నా కక్షిదారుని సదరు ఆస్తి కొట్టేయాలని దురుద్దేశ్యంతో (Forgery) ఫోర్జరీ అగ్రిమెంటును సృష్టించి తప్పుడు దావాను గౌరవ కడప 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో దాఖలు చేసి, నా కక్షిదారుడు ఇతరులకు అమ్మకుండా ఇంజెంక్షన్ ఉత్తర్వులు కోరినప్పటికీ సదరు గౌరవ 4వ అదనపు జిల్లా జడ్జి కోర్టు వారు ఇంత వరకు ఏలాంటి ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేయ్యలేదు. అయితే సదరు ఓబుల్ రెడ్డి వారి అనుచరులతో కలిసి నా కక్షిదారుని ఆస్తి కాజేయ్యాలని దురుద్దేశ్యంతో ఉన్నారు. కావున నా కక్షిదారుడు సదరు ఫోర్జరీ (Forgery) అగ్రిమెంటును Scientific Examination(hand writing Expert) చేతివ్రాత పరిశోధనకు పంపమని కోర్టుద్వారా కోరియున్నారు. మరియు క్రిమినల్ కంప్లైంట్ కూడా దాఖలు చేయ్యగా వల్లూరు పోలీసు స్టేషన్ లో Crime No.227/2022 గా రిజిస్టర్ చేసి ఉన్నారు. నా కక్షిదారుడు ఇదివరలో 2022, ఆగస్టు నెల 12వ తారీఖున, 1) కలమల్ల పెద్ద దస్తగిరి, 2) కలమల చిన్న దస్తగిరి, 3) కలమల ఖాదర్ భాష, 4) కలమల రామలక్ష అమ్మకాలపుతూ అగ్రిమెంటు వ్రాయించి ఉన్నారు. సదరు అగ్రిమెంటుకు అన్యాయం చేయుటకు అందరు కలిసి ప్రయత్నిస్తున్నారు.

కావున సదరు ఆస్తిపైన నా కక్షిదారునికి సర్వ హక్కులు కలవు. కావున సదరు ఓబుల్‌రెడ్డి కి ఏలాంటి హక్కు, సంబంధం ఈ ఆస్తిపైన లేవు అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు: ఎం. సురేష్ కుమార్, వై.ఎస్. ఉమాబాయి
న్యాయవాదులు, కడప. సెల్: 9440673996